సాక్షి
కర్నూలు
మంగళవారం, 7, నవంబర్, 2023



కృష్ణమ్మను వీడుతూ..

కొత్తపల్లి: సంగమేశ్వరం వద్ద కృష్ణాజలాలు తగ్గుముఖం పట్టాయి. మరి కొద్ది రోజుల్లో జలదిగ్బంధం నుంచి సంగమేశ్వరాలయం పూర్తిగా బయటపడి పూజలు ప్రారంభం కానున్నాయి.



శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రానికి భక్తుల రద్దీ కొనసాగింది. సోమవారం దర్శన క్యూలన్నీ నిండిపోయాయి. క్యూలలో వేచి ఉన్న భక్తులకు దేవస్థాన సిబ్బంది అల్పాహారం అందించారు.



కేసీకి నీటి విడుదల

నందికొట్కూరు రూరల్ : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి కేసీ కాలువకు నీటిని వదిలారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

న్యూస్‌రీల్

ఓటరుగా నమోదుకు 8,636 దరఖాస్తులు

కర్నూలు(సెంట్రల్): ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలు, సలహాల స్వీకరణకు నవంబర్ 4, 5 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లాలోని 2,186 పోలింగ్ కేంద్రాల పరిధిలో రెండు రోజులపాటు బీఎల్ఓలు హాజరై ప్రజల నుంచి ఓటు నమోదు, తొలగింపు, పేర్లు, చిరునామాల్లో మార్పులు, ఇతరాత్రాలకు వినతులు అందజేశారు. అందులో భాగంగా ఓటరు నమోదుకు (ఫారం–6) 8,636 దరఖాస్తులు వచ్చాయి. ఫారం–6ఏ కింద 11, ఫారం–6బీ కింద 262, ఫారం–7 కింద 2140, ఫారం–8 కింద 2990 దరఖాస్తులను స్వీకరించారు. అలాగే ఆయా అవగాహన సదస్సులను ఈఆర్‌ఓలు 77 పోలింగ్ కేంద్రాల్లో, ఏఈఆర్‌ఓలు 755 పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ డాక్టర్ జి.సృజన రెండురోజుల అవగాహన సదస్సుల వివరాలను వెల్లడించారు.

పింఛన్ల పంపిణీలో కర్నూలు జిల్లాకు 7వ స్థానం

- 4వ స్థానంలో నిలిచిన నంద్యాల జిల్లా

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ముగిసింది. పంపిణీలో నంద్యాల జిల్లాకు రాష్ట్రంలో 4వ స్థానం, కర్నూలు జిల్లాకు 7వ స్థానం లభించినట్లు స్పష్టమవుతోంది. ఈ నెల 1న మొదలైన పింఛన్ల పంపిణీ 5వ తేదీ వరకు కొనసాగింది. కర్నూలు జిల్లాలో 2,46,122 పింఛన్లు ఉండగా.. 2,44,235 పింఛన్ల పంపిణీ పూర్తయింది. నంద్యాల జిల్లాలో 2,22,277 పింఛన్లు ఉండగా.. 2,20,627 పింఛన్లు పంపిణీ అయ్యాయి.

ఆరు మండలాల్లో తేలికపాటి వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. ఆదివారం రాత్రి చిప్పగిరిలో 28.6 మి.మీ, హాలహర్విలో 6.2, మద్దికెరలో 4.2, ఆలూరులో 2.4, ఓర్వకల్‌లో 1.2, కోడుమూరులో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. నవంబర్ నెల సాధారణ వర్షపాతం 29 మి.మీ ఉండగా ఇప్పటి వరకు 15.4 మి.మీ వర్షం కురిసింది. రానున్న మూడు, నాలుగు రోజుల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్ సేవలు పునఃప్రారంభం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో విద్యుత్ బిల్లులు బకాయి ఉండటంతో నిలిచిపోయిన ఎంఆర్‌ఐ, సీటీస్కాన్ సేవలు సోమవారం నుంచి పునఃప్రారంభమయ్యాయి. విద్యుత్ బకాయిలకు ఎంఆర్‌ఐ నిర్వాహకులు రూ.40లక్షలు, సీటీస్కాన్ నిర్వాహకులు రూ.27లక్షలు ఆసుపత్రి ఖజానాకు చెల్లించారు. దీంతో వారికి ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్‌సేవలు అందించేందుకు ఆసుపత్రి అధికారులు అనుమతించారు. మరోవైపు నూతన డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో కొత్త సీటీస్కాన్ సేవలను సైతం అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్, జనరేటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇదే బ్లాక్‌లో అన్ని రకాల వైద్యపరీక్షలు అందించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

ప్రకాశం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా సునీల్ కన్నా

కర్నూలు సిటీ: సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా పని చేస్తున్న డాక్టర్ సునీల్ కన్నాను ప్రకాశం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా నియమిస్తూ మైనార్టీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇంతియాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. లెక్చరర్‌గా 2003 నుంచి 20 ఏళ్ల పాటు అధ్యాపకులుగా పనిచేయడం, వివిధ హోదాల్లో పరిపాలనపై ఈయనకు అనుభవం ఉంది. దీంతో పాటు మైనార్టీ సంక్షేమ శాఖ విజన్, మిషన్ పట్ల సునీల్ కన్నాకు ఉన్న సామాజిక స్పృహతోనే ఒంగోలు మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా నియమించారు. అయితే ప్రకాశం జిల్లాకు సైతం ఫారిన్ సర్వీస్ కింద బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన సిల్వర్ జూబ్లీ కాలేజీలో రెండు రోజుల క్రితమే రిలీవ్ అయ్యారు.

శ్రీశైల దేవస్థానానికి కారు విరాళం



శ్రీశైలంటెంపుల్: తిరుపతికి చెందిన ఉదయ్ కుమార్‌రెడ్డి సోమవారం ఎంజీ ఆస్టోర్ వాహనాన్ని శ్రీశైల దేవస్థానానికి విరాళంగా అందజేశారు. సోమవారం ఉదయం గంగాధర మండపం వద్ద దాతలు ఈ వాహనాన్ని దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజుకు అందజేశారు. ఈ వాహనం విలువ సుమారు రూ.15 లక్షలు ఉంటుందని దాతలు తెలిపారు.

సామాజిక చైతన్యం.. సాధికార సంతకం

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు తలెత్తుకునేలా పదవులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక మెరుగైన అవకాశాలు
- రాజకీయం, విద్య, వైద్యం, సామాజిక రంగాల్లో సముచిత స్థానం
- ఆర్థికంగా ఎదిగేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు
- నేడు ఆళ్లగడ్డలో వైఎస్‌ఆర్‌సీపీ సామాజిక సాధికార యాత్ర
- ఏర్పాట్లు పూర్తి.. హాజరు కానున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు

అట్టడుగు వర్గాల వారికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అగ్రాసనం వేసింది. అందరి ముందు వారు తలెత్తుకుని తిరిగేలా పదవులు అప్పగించింది. వారి అభ్యున్నతికి పలు పథకాలు అమలు చేస్తోంది. ఇంతకుముందు ఎన్నడూ లేని విధంగా సమాజంలో అసమానతలు తొలగించి..సాధికారతను తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో బడుగు, బలహీన వర్గాల ప్రజల బతుకుల్లో వచ్చిన మార్పును వివరించేందుకు బస్సు యాత్ర మంగళవారం ఆళ్లగడ్డకు రానుంది.

కర్నూలు(రాజ్‌విహార్): ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం.. ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చాక విస్మరించడం.. గతంలో పరిపాటిగా ఉండేది. సమాజంలో చిన్నచూపుతో ఎదగలేక, పాలకవర్గాల నుంచి చేయూత లభించక బడుగు, బలహీన వర్గాల ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవారు. తమకూ పదవులు ఇవ్వాలని కోరేవారు. అయితే గత టీడీపీ ప్రభుత్వం వీరి ఆవేదనను, ఆక్రందనను పట్టించుకోలేదు. ఆందోళనకారులకు హేళనలు, అవమానాలు ఎదురయ్యేవి. దాడులు, దౌర్జన్యాలు నిత్యకృత్యంగా మారేవి. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అట్టడుగు వర్గాల ప్రజల బతుకుల్లో మార్పులు వచ్చాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవుల్లో వీరికి అగ్రతాంబూలం అందించారు. 'బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదు.. బ్యాక్ బోన్ క్లాస్.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలంతా నా మనుషులు' అంటూ ఆయా వర్గాలను సొంతం చేసుకున్నారు. ఆయా వర్గాలు అభివృద్ధిలోకి వచ్చేందుకు రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్య, వైద్యం వంటి రంగాల్లో హద్దులు లేకుండా అవకాశాలు కల్పించారు. నేడు ఆయా వర్గాలు సమాజంలో గౌరవంగా తలెత్తుకునే రోజులు తెచ్చారు. ఈ నేపథ్యంలో ఆయా వర్గాలకు చేసిన మేలును వివరించేందుకు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ సామాజిక సాధికార బస్సు యాత్ర పేరుతో ప్రజల్లోకి వస్తోంది. ఈ యాత్ర మంగళవారం నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఓసీ స్థానాల్లో టికెట్లు ఇచ్చి..

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలు రాజకీయంగా ఎదిగేలా పదవులు ఇచ్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 60 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఈ విషయంలో టీడీపీ నేతలు కోర్టులో కేసు వేశారు. రిజర్వేషన్లు 50 శాతం దాటరాదని హద్దులు పెట్టగా.. కోర్టు తీర్పును గౌరవిస్తూనే ఓసీ స్థానాల్లోనూ బడుగు, బలహీన వర్గాలకు టికెట్లు ఇచ్చి గెలిపించారు. ఇంతటి ధైర్యం, సాహసం ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఏ పార్టీ, ఏ ప్రభుత్వం చేయలేదు.



ఆళ్లగడ్డలో బహిరంగ సభ జరిగే ప్రదేశం

టీడీపీ హయాంలో అవమానాలు

''దళితుల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా?.. ఏయ్ ఏమి.. నన్నే ప్రశ్నిస్తారా?.. మీ తోకలు కత్తిరిస్తా'' అని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అవమానకరంగా మాట్లాడారు. ఆ పార్టీ నేతలు దళిత, బలహీన వర్గాలపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. అలాగే దాడులు, దౌర్జన్యాలతో అవమానించిన సందర్భాలు అనేకం. టీడీపీ హయాంలో హేళనతో, ఆందోళనతో బడుగు, బలహీన వర్గాల వారు తీవ్ర మనోవేదనకు గురయ్యారు.

ఆత్మవిశ్వాసాన్ని నింపిన బీసీ డిక్లరేషన్

వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి ఎన్నో అవకాశాలు కల్పించింది. బీసీ డిక్లరేషన్ ప్రకటించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. రాజకీయ, విద్య, వైద్యం, సామాజిక రంగాల్లో సముచిత స్థానం కల్పించడంతో పాటు ఆర్థికంగా ఎదిగేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసింది. టీడీపీ హయాంలో బడుగు, బలహీన వర్గాల వారు సంక్షేమ పథకాల కోసం జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవాల్సి వచ్చేది. కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగలేక చాలా ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. వలంటీర్ వ్యవస్థతో అవినీతికి తావులేకుండా ప్రభుత్వ పథకాలను ఇంటి వద్దనే అందిస్తున్నారు. సచివాలయ వ్యవస్థతో ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

సాధికార బస్సుయాత్ర సాగుతుందిలా..

ఆళ్లగడ్డ: బస్సు యాత్రలో డిప్యూటీ సీఎంలు అంజాద్ బాషా, నారాయణ స్వామి, మంత్రులు గుమ్మనూరు జయరాం, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొనున్నారు.

- మధ్యాహ్నం ఒంటి గంటకు ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మీ ఫంక్షన్ హాలు వద్ద సమావేశం నిర్వహిస్తారు. 2 గంటలకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన ముఖ్య నేతలతో సమావేశం ఉంటుంది. తర్వాత సహపంక్తి భోజనం.
- 3.45 గంటలకు ఫంక్షన్ హాల్‌నుంచి నాలుగు రోడ్ల సెంటర్ వరకు భారీ మోటర్ సైకిల్ ర్యాలీ.
- 4.33 గంటలకు కోవెలకుంట్ల రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు.
- సాయంత్రం 4.35 గంటలకు నాలుగు రోడ్ల కూడలిలో భారీ బహిరంగ సభ.

పదవులతో పెరిగిన గౌరవం

వైఎస్‌ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చాక అణగారిన వర్గాలకు రాజ్యాంగ పదవులు వచ్చాయి. రాష్ట్ర మంత్రి వర్గంలో జిల్లాకు చెందిన గుమ్మనూరు జయరాంకు చోటు కల్పించారు. ఎమ్మెల్యేలుగా డాక్టర్ సుధాకర్, తొగూరు ఆర్థర్‌కు అవకాశం ఇచ్చారు. మేయర్, పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్ష పదవి బీవై రామయ్యకు ఇచ్చారు. ఇసాక్ (నంద్యాల), డాక్టర్ మధుసూదన్ (ఆదోని)కు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చారు. రాష్ట్రంలోని 139 కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, జిల్లాకు చెందిన నలుగురికి రాష్ట్ర చైర్మన్ పదవులు ఇచ్చారు. ఇందులో లింగాయత్, కుర్ని, బెస్త కార్పొరేషన్లు ఉండగా రాష్ట్ర వ్యాప్తంగా 440 డైరెక్టర్లలో కర్నూలుకు 32 ఇచ్చారు. ఇందులో 18 (50శాతానికి మించి)పోస్టులు బడుగు, బలహీన వర్గాలకు కట్టబెట్టారు. మీట్, ఖాదీ, ఆయిల్ అండ్ ఫెడరేషన్ తదితర కార్పొరేషన్లు, జిల్లా నామినేటెడ్ పదువుల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ, డీసీఎంఎస్‌తో పాటు 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకే ఇచ్చారు. వీటితో పాటు స్థానిక సంస్థల్లో జెడ్పీటీసీ, ఎంపీపీ, జిల్లా పరిషత్, మండల పరిషత్ వైస్ చైర్మన్లు, డిప్యూటీ మేయర్, ఎంపీటీసీలతో పాటు సర్పంచ్ అభ్యర్థులుగా ఆయా వర్గాల అభ్యర్థులను నిలిపి మద్దతు ఇచ్చి గెలిపించింది ప్రభుత్వం. దీంతో పాటు పార్టీ పదవుల్లోనూ 50 శాతానికి మించి అప్పగించి రాజకీయంగా గుర్తింపు కల్పించారు. పార్టీ కోసం పనిచేస్తే నామినేటెడ్, పార్టీ పదవులు వస్తాయని భరోసా కల్పించిన ఏకైక పార్టీ వైఎస్‌ఆర్‌సీపీ అని చెప్పవచ్చు.

అణగారిన వర్గాలకు మేలు చేసిన ప్రభుత్వం



రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన ఏకైక ప్రభుత్వం మనదే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పదువులతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో 50శాతానికి పైగా అవకాశాలు ఇచ్చారు. మంత్రి వర్గంతోపాటు ప్రతి విభాగంలోనూ అవకాశాలు కల్పించారు. చేసింది చెప్పేందుకే బస్సు యాత్ర.

– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే

బడుగులు, బలహీనులను సొంతం చేసుకున్నారు



బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలను తన వాళ్లుగా సొంతం చేసుకున్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. స్థానిక సంస్థల్లో 60 శాతానికి పైగా అవకాశాలు కల్పించారు. 50 శాతం మించరాదని న్యాయం స్థానం చేబితే.. జనరల్ స్థానాల్లో కూడా అణగారిన వర్గాలకు టికెట్లు ఇచ్చారు. సామాజిక సాధికార యాత్ర జయప్రదం కోసం అన్ని వర్గాలు కలిసి రావాలి.

– బీవై రామయ్య, వైఎస్‌ఆర్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్.

ప్రజాసంకల్ప యాత్ర చరిత్రాత్మకం



పార్టీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న బీవై రామయ్య



ఆలూరులో కేక్‌కట్ చేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

- విలేకరుల సమావేశంలో మేయర్ బీవై రామయ్య

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో చేసిన ప్రజాసంకల్ప పాదయాత్ర చరిత్రాత్మకమైనదని వైఎస్‌ఆర్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య అన్నారు. సోమవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడారు. పేదల కష్టాలు తెలుసుకునేందుకు 2017 నవంబరు 6వ తేదీన ఇడుపులపాయ నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర ప్రారంభించి.. శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం వరకు కొనసాగించారన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచే హామీలు అమలు చేశారన్నారు. నాలుగున్నరేళ్లలో 95 శాతం అమలు చేసి చరిత్ర సృష్టించారన్నారు. పేదలకు ఎంతో మేలు చేస్తున్నా ఓర్వలేని టీడీపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. రెండు చోట్ల పోటీ చేసినా కనీసం ఎమ్మెల్యేగా గెలవలేని పవన్ కళ్యాణ్ పార్టీ పెట్టి చంద్రబాబు పల్లకీ మోస్తున్నారన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆ పార్టీ లక్ష్యాలని పక్కన పెట్టి చంద్రబాబు కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ 175 స్థానాల్లో గెలుపు సాధించడం తథ్యమన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, పార్టీ నాయకులు సురేంద్రరెడ్డి, మద్దయ్య, ధనుంజయ ఆచారి, సత్యం యాదవ్, లక్ష్మీకాంతయ్య, షరీఫ్, యూనుస్, గౌతం తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ సీఎం వైఎస్ జగన్

ఆలూరు: సంక్షేమానికి, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తూ.. దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ప్రజాసంకల్ప పాదయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఆలూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేశారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలు 95 శాతం అమలు చేసి సీఎం వైఎస్ జగన్ ప్రజలు మదిలో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గాంధీజీ కలలుగన్న గ్రామస్వ రాజ్యాన్ని సాకారం చేశారని తెలిపారు. కార్యక్రమంలో దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ ఆలూరు మండల కన్వీనర్ వీరేష్, చిప్పగిరి మండల కన్వీనర్ మారయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంభీమ్ నాయుడు, వైస్ ఎంపీపీ నాగవేణి, సర్పంచ్ దేవిరెడ్డి, ఎంపీటీసీల సభ్యులు దేవరాజ్, బోయ ఎల్లమ్మ, నాగమ్మ, జంగాలి ఎల్లమ్మ పాల్గొన్నారు.

24 మండలాల్లోని 2,76,714 హెక్టార్లలో పంట నష్టం

- నేషనల్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్‌కు ప్రతిపాదనలు

కర్నూలు(అగ్రికల్చర్): కరువు పరిస్థితిపై జిల్లా యంత్రాంగం నేషనల్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్(ఎన్‌డీఆర్‌ఎఫ్) కింద ప్రతిపాదనలు పంపింది. కరువు పరిస్థితులు ఏర్పడినపుడు ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ నామ్స్ ప్రకారం రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందుతుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు నేషనల్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్ నామ్స్‌కు అనుగుణంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ప్రతిపాదనలు పంపారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ కింద నీటిపారుదల కింద హెక్టారుకు రూ.17వేలు, వర్షాధారం కింద హెక్టారు రూ.8,500 ప్రకారం రిలీఫ్ ఉంది. జిల్లాలో తుగ్గలి, కర్నూలు రూరల్ మినహా మిగిలిన 24 మండలాలను ప్రభుత్వం కరువు ప్రాంతాలుగా గుర్తించింది. ఈ మండలాలకు సంబంధించి అనావృష్టి పరిస్థితుల వల్ల 3,32,101 మంది రైతులు నష్టపోయారు. కరువు ప్రాంతాల్లో 2,76,714.6 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. ఎన్‌డీఆర్‌పీ కింద రైతులకు రిలీఫ్ ఇవ్వడానికి రూ.246.33 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. స్టేట్ డిజిస్టర్ రిలీఫ్ ఫండ్ కింద ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సి ఉంది. దీనిపై ప్రభుత్వం త్వరలోనే ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది.

కరువులో ఉపశమనం

నేడు వైఎస్‌ఆర్ రైతుభరోసా-పీఎం కిసాన్ పెట్టుబడి సాయం విడుదల

- వరుసగా ఐదేళ్లు వైఎస్‌ఆర్ రైతుభరోసా అమలు
- నాడు టీడీపీ ప్రభుత్వం రుణమాఫీ పేరిట మోసం
- చెప్పిన దానికంటే మిన్నగా అమలు చేస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం
- శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నుంచి రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ
- కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి కార్యక్రమం



నియోజకవర్గం వారీగా రెండో విడతలో లబ్ధి ఇలా..

నియోజకవర్గం	మొత్తం రైతులు	పొందుతున్న సాయం(రూ॥ల్లో)
కోడుమూరు	40,017	16,00,68,000
ఎమ్మిగనూరు	41,234	16,49,36,000
మంత్రాలయం	45,209	18,08,36,000
ఆదోని	20,524	8,20,96,000
పత్తికొండ	58,898	23,55,92,000
పాణ్యం (కల్లూరు,ఓర్వకల్)	22,890	9,15,60,000
ఆలూరు	67,967	27,18,68,000
మొత్తం	2,96,739	122,58,64,000

కర్నూలు(అగ్రికల్చర్): కరువు సమయంలో అన్నదాతకు ఉపశమనం కల్పిస్తూ ప్రభుత్వం వైఎస్‌ఆర్ రైతుభరోసా- పీఎం కిసాన్ కింద ఆర్థిక తోడ్పాటు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసింది. 2023–24వ సంవత్సరానికి సంబంధించి రెండో విడత పెట్టుబడి సాయం రూ.122,58,64,000 డీబీటీ ద్వారా రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది. మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. స్థానికంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య, ఎమ్మెల్యే, ఎంపీలతో పాటు రైతులు పాల్గొంటారు. వరుసగా ఐదేళ్లు ప్రభుత్వం ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తోంది. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పంటల సాగులో రైతులకు పెట్టుబడి సమస్యలకు తావు లేకుండా వైఎస్‌ఆర్ రైతుభరోసా కింద సాయం అందచేస్తుండటంతో రైతులు ఉపశమనం పొందుతున్నారు.

రుణమాఫీకి తూట్లు పొడిచిన గత టీడీపీ ప్రభుత్వం

2014 అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న పంట రుణాలను, బంగారు ఆభరణాలపై తీసుకున్న వాటితో సహా మాఫీ చేస్తాం.. రుణాలు చెల్లించవద్దని ప్రకటించారు. అయితే అధికారం చేపట్టిన వెంటనే మాట మార్చారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం అంటూ మెలిక పెట్టి రైతులను నట్టేట ముంచారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 అసెంబ్లీ ఎన్నికలకు ముందు రైతులకు, పొదుపు మహిళలు.. ఇతర అన్ని వర్గాల వారికి చెప్పిన అన్నింటినీ అధికారం చేపట్టిన వెంటనే అమలు చేయడానికి శ్రీకారం చుట్టారు. ఐదేళ్లలో చెప్పిన దాని కంటే మిన్నగా అమలు చేసి విశ్వసనీయతకు పెద్దపీట వేశారు.

విజయవంతంగా వైఎస్‌ఆర్ రైతు భరోసా

వైఎస్‌ఆర్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం విజయవంతంగా ఐదేళ్ల అమలు చేయడం విశేషం. సుదీర్ఘ పాదయాత్ర ద్వారా రైతుల కష్టాలను ప్రత్యక్షంగా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టగానే వైఎస్సార్ రైతుభరోసాకు శ్రీకారం చుట్టారు. 2020, 2021 సంవత్సరాల్లో కోవిడ్–19తో ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం అయినప్పటికి ఎక్కడా లోపం లేకుండా అమలు చేయడం పట్ల రైతులు ప్రభుత్వానికి కృతజ్ఞత చూపుతున్నారు. ఐదేళ్లలో అన్నదాతలకు రూ.1608.10 కోట్ల పెట్టుబడి సాయం అందింది.

రైతుల కష్టం తెలిసిన సీఎం జగనన్న



కరువు కాటకాల్లోనూ గత టీడీపీ ప్రభుత్వం ఏనాడు పట్టించుకోలేదు. వైఎస్ఆర్ ప్రభుత్వం రావడంతో రైతుల కష్టాలు గట్టెక్కాయి. వైఎస్‌ఆర్ రైతుభరోసా కింద ఏటా క్రమం తప్పకుండా పెట్టుబడి సాయం అందుతోంది. మాకు మూడు ఎకరాల భూమి ఉంది. పత్తి, కంది పంటలు సాగు చేస్తుంటా. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కష్టం తెలిసిన నేత కావడంతోనే కష్టాల్లో తోడుగా నిలుస్తున్నారు.

– బోయరాజు, చిన్నటేకూరు, కల్లూరు మండలం

పెట్టుబడి కష్టాలు దూరం



ప్రభుత్వం ఏటా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్న నగదుతో పెట్టుబడి కష్టం దూరమవుతోంది. 2023–24వ సంవత్సరానికి సంబంధించి రెండో విడత పెట్టుబడి సాయాన్ని రబీ సమయంలో విడుదల చేస్తుండటం రైతులకు ఎంతో ఉపశమనం. కర్నూలు జిల్లాకు సంబంధించి జిల్లా స్థాయి కార్యక్రమంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నాం.

– వరలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి, కర్నూలు

క్లుప్తంగా

అర్జీలను సత్వరం పరిష్కరించాలి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): జగనన్నకు చెబుదాం–స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించాలని జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన జగనన్నకు చెబుదాం –స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి జేసీ, ఇతర అధికారులు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీలు రీఓపెన్ కాకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ఇదే సమయంలో స్పష్టంగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. పరిష్కారాలు చేసే సమయంలో లబ్ధిదారులతో మాట్లాడితే మంచి ఫలితం ఉంటుందన్నారు. స్పందనలో ఎక్కువగా రెవెన్యూ సమస్యలే ఉంటున్నందున తహసీల్దార్లు బాధ్యతతో పని చేయాలన్నారు. బీఎల్ఓలు తప్పనిసరిగా ఫిర్యాదులపై ఇంటింటా విచారణ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదనరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రమ, నాగప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీశైల ధర్మకర్తల మండలి సమావేశం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల సమావేశం మంగళవారం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు దేవస్థానం పరిపాలనా భవనంలోని సమీక్ష సమావేశ మందిరంలో 20వ ధర్మకర్తల మండలి సమావేశం చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి అధ్యక్షతన జరగనుంది. ఈ సమావేశానికి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి డి.పెద్దిరాజు, పాలక మండలి సభ్యులు, ఆలయాధికారులు పాల్గొననున్నారు. సమావేశంలో క్షేత్రాభివృద్ధి, భక్తుల సౌకర్యార్థం కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించి పలు అజెండాలకు ధర్మకర్తల మండలి సభ్యులు ఆమోదం తెలపనున్నారు.

842 అడుగులుగా శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నీటిమట్టం సోమవారం సాయంత్రానికి 842 అడుగులకు చేరుకుంది. జలాశయం నుంచి ఆదివారం నుంచి సోమవారం వరకు 4,887 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 960 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,392, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 64.9090 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పల్లెల్లో ప్రగతి దారులు

- రూ.12.10 కోట్లతో సీసీ రోడ్లు
- 194 పనులకు పాలనా అనుమతులు
- ఎమ్మెల్యేల ప్రతిపాదనలకు 21 మండలాల్లో ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- మారనున్న గ్రామాల్లోని అంతర్గత రోడ్ల రూపురేఖలు
- ఇప్పటికే రూ.189.27 కోట్లతో హైఇంపాక్ట్ రోడ్ల పనులు మంజూరు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యతను ఇస్తోంది. నేషనల్ హైవేస్, జిల్లా ప్రధాన రహదారులకు ఇతోధికంగా నిధులు విడుదల చేస్తూనే, గ్రామీణ ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లకు కూడా నిధులను మంజూరు చేసింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమంలో భాగంగా ఆయా సచివాలయాల పరిధిలోని ఎమ్మెల్యేల దృష్టికి వచ్చిన రోడ్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించింది. ఈ నేపథ్యంలోనే వారి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ప్రతిపాదించి జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు ఒక్కో మండలానికి రూ.60 లక్షలు కేటాయిస్తు పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాల పనులను వెంటనే చేపట్టి నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కర్నూలు జిల్లాలోని 21 మండలాల్లో రూ.12.10 కోట్లతో 194 పనులు మంజూరయ్యాయి.

మంజూరైన పనులు

కర్నూలు డివిజన్‌లోని కల్లూరు, ఓర్వకల్లు వెల్దుర్తి, మద్దికెర, పత్తికొండ, తుగ్గలి, కృష్ణగిరి మండలాలకు సంబంధించి రూ.4.20 కోట్లతో 82 పనులు మంజూరయ్యాయి. అలాగే ... ఆదోని డివిజన్‌కు సంబంధించి ఆదోని, ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, దేవనకొండ, హాలహర్వి, హొళగుంద, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం, పెద్దకడుబూరు, కోసిగి, కౌతాళం, మంత్రాలయం మండలాల్లో రూ.7.90 కోట్లతో 112 పనులు మంజూరయ్యాయి.

ఇప్పటికే రూ.189.27 కోట్లతో హైఇంపాక్ట్ రోడ్ల పనులు

ఇప్పటికే ఉమ్మడి కర్నూలు జిల్లాలో హై ఇంపాక్ట్ రోడ్ల పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.187.27 కోట్లతో పాలనా అనుమతులు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి పీఆర్అండ్ఆర్‌డీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ బీ రాజశేఖర్ గత నెల 30న జీఓఆర్‌టీ నెంబర్: 726ను జారీ చేశారు. జిల్లాలో ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన రోడ్లను గుర్తించాలని ప్రభుత్వం పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖలను ఆదేశించింది. ఒక్కో నియోజకవర్గం నుంచి ఐదు రోడ్లను ఎంపిక చేసి అంచనాలు రూపొందించి పంపించాలని కోరింది. ఈ నేపథ్యంలోనే పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మొత్తం 39 రోడ్లను గుర్తించి ఇందుకు రూ.189.27 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు పంపారు. ఈ నేపథ్యంలోనే ఆయా పనులకు పాలనా అనుమతులు మంజూరయ్యాయి. ఈ పనులకు వెంటనే టెండర్లను ఆహ్వానించి పనులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయనున్నారు.



త్వరలోనే పనుల ప్రారంభం



గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం పాలనా అనుమతులు మంజూరు చేసిన నేపథ్యంలో ఆయా పనులను వెంటనే చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నాం. ఎమ్మెల్యేల ప్రతిపాదనల మేరకు ఈ పనులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే పలు మండలాల్లో ఇప్పటికే క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఇంజినీర్లు ఆయా గ్రామాలకు వెళ్లి రోడ్లను పరిశీలించి కొలతలు వేసి పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. – కే సుబ్రమణ్యం, పీఆర్ ఎస్ఈ

జనరంజకంగా జగనన్న పాలన

- సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం
- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- నాల్గులేన్ల రహదారి ప్రారంభం



నూతన రహదారిపై పాదయాత్ర చేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ జనరంజకంగా పాలన కొనసాగిస్తున్నారని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారన్నారు. అయ్యలచెర్వు నుంచి బేతంచెర్ల పట్టణం మీదుగా కేజీబీవీ వరకు, డోన్ క్రాస్ రోడ్డు నుంచి హెచ్ కొట్టాల వరకు రూ.28 కోట్లతో పూర్తైన నాల్గు లైన్ల రహదారులను సోమవారం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం అయ్యల చెర్వు నుంచి బేతంచెర్ల పట్టణం మీదుగా హెచ్.కొట్టాల వరకు 7 కిలో మీటర్లు పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో అడుగడుగునా జనం నీరాజనం పలికారు. వేలాది మందికి జీవనాధారమైన నాపరాయి పరిశ్రమకు 5 శాతం జీఎస్టీ సాధించినందుకు మంత్రి బుగ్గనకు పరిశ్రమల యజమానులు, కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో సిమెంట్‌నగర్‌కు చెందిన పాదుపు మహిళలు బేతంచెర్లలో మంత్రి బుగ్గనకు హారతులు పట్టారు. కర్నూలు, నంద్యాల రోడ్డు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన రావు బహదూర్ బీపీ శేషారెడ్డి విగ్రహాన్ని మంత్రి బుగ్గనతో పాటు సోదరుడు బుగ్గన సంజీవ రెడ్డి, ఎంపీ, జెడ్పీ చైర్మన్‌లు ఆవిష్కరించారు.

బతుకుబాటలో మృత్యు ఒడికి..

- రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి
- మరో ఇద్దరికి గాయాలు
- మృతుడు గుంతకల్లు వాసి.. ఏడు నెలల క్రితమే వివాహం



నుజ్జునుజ్జు అయిన లారీ ముందుభాగం





మృతిచెందిన బోయ రామాంజి (ఫైల్), ప్రమాదంలో గాయపడ్డ బోయ కృష్ణ

ఎమ్మిగనూరురూరల్: బతుకుదెరువు నిమిత్తం డ్రైవింగ్ వృత్తిని ఎంచుకున్న అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణానికి చెందిన బోయ రామాంజి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కోటేకల్ గ్రామ కొండ రెండవ మలుపు దగ్గర బొలెరో, లారీ ఢీకొనడంతో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ దుర్ఘటన చోటుచేసుంది. ప్రమాదంలో మరో ఇద్దరు గాయపడ్డారు. గుంతకల్లు రాయల్ సర్కిల్లోని కథలగేరి తిలక్‌నగర్‌కు చెందిన బోయ గురవయ్య, సావిత్రమ్మలకు ఒక్కగానొక్క కుమారుడు బోయ రామాంజి(31). ఏడు నెలల క్రితం గుంతకల్లులోని మేనమామ ఎర్రిస్వామి కుమార్తె శైలజతో వివాహమైంది. తండ్రి చీరల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా రామాంజి సొంతంగా బొలెరో వ్యాన్ కొని అద్దెకు తిప్పుతుండేవాడు. గుంతకల్లు నుంచి కాలీఫ్లవర్ లోడ్ హైదరాబాద్‌కు తీసుకెళ్లి అక్కడ అన్‌లోడ్ చేశాడు. అక్కడ నుంచి గుంతకల్లుకు తిరిగి వస్తుండగా ఆదోనిలో ఓ ఇంటికి సామాన్లను దించాలని బాడుగ రావటంతో వాటిని లోడ్ చేసుకున్నాడు. హైదరాబాద్‌లో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న తన స్నేహితుడు బోయ కృష్ణకు ఫోన్ చేసి వ్యాన్‌లో ఎక్కించుకొని ఊరికి బయలుదేరాడు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటిగంట సమయంలో కోటేకల్ కొండ రెండో మలుపు దగ్గర ఆదోని నుంచి కర్నూలు వైపు వస్తున్న లారీ, ఆదోనికి వెళ్తున్న బొలెరో వ్యాన్ ఢీ కొట్టుకున్నాయి. ప్రమాదంలో వ్యాన్ నుజ్జునుజ్జు అయ్యింది. డ్రైవర్ బోయ రామాంజి కుడి చేయి తెగి దూరంగా పడిపోయి.. డ్రైవర్ సీట్లు ఇరుక్కుపోయాడు. బోయ కృష్ణ వ్యాన్ క్యాబిన్‌ల్లో ఇరుక్కుపోయారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న 108, రోడ్ సెఫ్టీ సిబ్బంది, రూరల్ పోలీసులు అక్కడి చేరుకున్నారు. బొలెరో వ్యాన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ బోయ రామాంజిని జేసీబీని తెప్పించి రెండు గంటల పాటు శ్రమించి బయటకు తీశారు. గొంతు పూర్తిగా కోసుకుపోయి వ్యాన్‌లో డ్రైవర్ రామాంజి మృతిచెందాడు. ప్రమాదంలో గాయపడ్డ బోయ కృష్ణను ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదే ప్రమాదంలో గాయపడ్డ లారీ డ్రైవర్ సంజీవను ఆదోని ప్రభుత్వాసుపత్రికి 108లో తరలించారు. ప్రమాద స్థలాన్ని రూరల్ సీఐ మోహన్ రెడ్డి పరిశీలించారు. ప్రమాద విషయాన్ని పోలీసులు గుంతకల్లులోని మృతుడి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతుడి తల్లి సావిత్రమ్మ రెండు నెలల క్రితమే అనారోగ్యంతో మృతి చెందగా, ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందటంతో తండ్రి, భార్య శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకుఅప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ మోహన్‌రెడ్డి, ఏఎస్ఐ రుక్మిణి తెలిపారు.

రైలు కిందపడి వృద్ధుడి మృతి



శ్రీరాములు (ఫైల్)

డోన్ రూరల్: స్థానిక దొరపల్లి బ్రిడ్జి వద్ద సోమవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారి పడి ఓ వృద్ధుడు మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. నాగర్‌కర్నూలు జిల్లా బిజినేపల్లి మండలం లట్టుపల్లి గ్రామానికి చెందిన బోయ శ్రీరాయులు(67) శివాంజనేయ భజన మండలి గ్రూపులో సభ్యుడు. ఈనెల 2వ తేదీ గ్రూపు సభ్యులతో కలసి తిరుమల వెళ్లిన ఆయన 4వ తేదీ రాత్రి రేణిగుంట నుంచి రైలులో మహబూబ్‌నగర్‌కు బయలుదేరాడు. కాగా దొరపల్లి బ్రిడ్జి వద్ద ప్రమాదవశాత్తూ రైలులో నుంచి జారి పడి మృతి చెందాడు. కాగా శ్రీరాములు కనిపించకపోవడంతో భజన మండలి సభ్యులు కర్నూలు రైల్వే పోలీసులను సంప్రదించారు. వారు డోన్ రైల్వే పోలీసులను ఆరా తీయగా ప్రమాద విషయం తెల్పడంతో మృతదేహాన్ని గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని మృతుని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

పార్టీలకతీతంగా సీఎం రిలీఫ్‌ఫండ్



బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

- పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: సీఎం సహాయ నిధి కింద బాధిత కుటుంబాలకు పార్టీలకతీతంగా సాయం అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని కృష్ణగిరి, తుగ్గలి, వెల్దుర్తి, పత్తికొండ, మద్దికెర మండలాలకు చెందిన బాధిత కుటుంబాలకు సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అమీనాబాద్ నాగేశ్వరరావుకు రూ.5లక్షలు, మారెళ్ల కప్పల దాసన్నకు రూ.2లక్షలు, ప్యాలకుర్తి రామదాసుకు రూ.1.70లక్షలు, కప్పల పులికొండ దొడ్డి ధనుంజయకు రూ.50వేలు, పత్తికొండ తిప్పారెడ్డికి రూ.20వేలు, తుగ్గలి బోయ రాజుకు రూ.2లక్షలు, జి.ఎర్రగుడి రాంగోపాల్‌రెడ్డికి రూ.55వేలు అందజేసినట్లు చెప్పారు. అలాగే కంబాలపాడు రాంచరణ్‌గౌడ్‌కు రూ.30వేలు, పత్తికొండ పింజరి హాజిరాబీకి రూ.36వేలు, బురుజుల బెస్త హిమవర్షిణికి రూ.10వేలు, పత్తికొండ షేక్ మహమ్మద్‌కు రూ.4లక్షలు, బొమ్మిరెడ్డిపల్లి మాసపోగు సుంకన్నకు రూ.60 వేలు, అగ్రహారం వెంకటలక్ష్మికి రూ.1.20లక్షలు, మద్దికెర కంబగిరి రెడ్డికి రూ.40వేలు, పత్తికొండ నాగన్నకు రూ.52వేలు, చెన్నంపల్లి కొలిమిగుండ్ల భాగ్యమ్మ కు రూ.24వేలు, పందికోన గోవిందమ్మకు రూ.20వేలు, అమీనాబాద్ గొల్లజయచంద్రకు రూ.32వేలు, వెల్దుర్తి ఆకుల లలితకు రూ.1.20లక్షలు చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. అర్హత ఉంటే చాలు తమ ప్రభుత్వం టీడీపీకి చెందిన కుటుంబాలకు కూడా సీఎం సహాయ నిధి అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాస్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కారం నాగరాజు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇంటి స్థలం నిర్ణయంపై హర్షం



కలెక్టరేట్ ఆవరణలో ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు

- సీఎం వైఎస్ జగన్ పోస్టర్‌కు పాలాభిషేకం

కర్నూలు(సెంట్రల్): అక్రిడేటెడ్ జర్నలిస్టులకు మూడు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించడంపై జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. తమ చిరకాల కోరికను నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటామని ప్రకటించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సాక్షి టీవీ ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్ పోస్టర్‌కు పాలాభిషేకం చేశారు. అంతకుముందు కలెక్టరేట్‌లోని మెయిన్ గేటు నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ థ్యాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు గోరంట్లప్ప, కొండా శ్రీనివాసులు మాట్లాడుతూ గత పాలకులు జర్నలిస్టులను మోసం చేశారన్నారు. ఎన్నికల హామీ మేరకు సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని మంత్రిమండలి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఆమోదం తెలపడం సంతోషమన్నారు. జర్నలిస్టులకు ఇంటిస్థలంతోపాటు ఇంటిని నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సాక్షి టీవీ ప్రతినిధి లోకేష్, సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ రవికుమార్, సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్ డి.హుస్సేన్, సీనియర్ జర్నలిస్టులు మధుసూదన్‌రెడ్డి, శ్రీరాములుతోపాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

దారిదోపిడీ దొంగల అరెస్ట్

- 3 తులాల బంగారు, 15 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం



నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

బొమ్మలసత్రం: రాత్రి వేళ వాహనదారులే లక్ష్యంగా చేసుకుని దారి దోపిడీలకు పాల్పడుతున్న ఆరుగురు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి నిందితుల వివరాలు వెల్లడించారు. తమ్మరాజుపల్లి గ్రామానికి చెందిన షఫీనా జాస్మిన్ ఆగస్టు 18న పాణ్యం వెళ్లేందుకు తన స్నేహితుడు అనిల్‌కుమార్‌ను సాయమడిగింది. అనిల్ తన బైక్‌పై జాస్మిన్‌తో కలిసి వెళ్తుండగా కొందరు దుండగులు అటకాయించి కత్తులతో బెదిరించి 31 గ్రాముల బంగారు చైను, రూ. 5 వేల నగదు, రెండు సెల్‌ఫోన్‌లు ఎత్తుకెళ్లారు. వెంటనే జాస్మిన్ పాణ్యం పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అలాగే నంద్యాల, డోన్, బేతంచెర్ల శివారు ప్రాంతాల్లో అనేక దారి దోపిడీలకు పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు పాణ్యం సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు అశోక్‌కుమార్, వెంకటసుబ్బయ్య రెండు బృందాలుగా దొంగల కోసం గాలించారు. సోమవారం వేకువజామున తమ్మరాజుపల్లి సమీపంలోని డాబా వద్ద పోలీసులు ఆరుగురు నిందితులను అరెస్ట్ చేయగా మరో ముగ్గురు నిందితులు పరారయ్యారు. నిందితుల్లో చెంచు దాసరి వీరయ్య, చెంచు దాసరి రామకృష్ణ, గొలుసన్న, వీరన్న, రాజేష్, సురేష్‌ల నుంచి 31 గ్రాముల బంగారు, 150 గ్రాముల వెండి ఆభరణాలు, ఒక సెల్ ఫోన్ 3 కత్తులను స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

రాచపుండు.. కేసులు మెండు

- మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు
- పురుషుల్లో జీర్ణకోశ, నోటి క్యాన్సర్లు అధికం
- అందుబాటులో ఆధునిక వైద్యం
- నేడు జాతీయ క్యాన్సర్ అవగాహన దినం



క్యాన్సర్ కణం

కర్నూలు(హాస్పిటల్): పూర్వం రోజుల్లో క్యాన్సర్‌ను రాచపుండుగా పిలిచేవారు. అంటే అప్పట్లో రాజుల లాంటి వారికి మాత్రమే ఆ వ్యాధి వచ్చేదన్నమాట. కానీ ఇప్పుడా వ్యాధికి రాజు పేద అన్న తేడా లేదు. పేద, ధనిక అన్న తారతర్యం లేదు. ఏ ఒక్కరినీ వదలనని చెబుతోంది. ఇటీవల కాలంలో క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. పెరుగుతోన్న పలు రకాల కాలుష్యాలు, ఆహార ఉత్పత్తుల్లో మితిమీరిన ఎరువులు, రసాయనాల వాడకం, జీవనశైలి కారణంగా ఈ వ్యాధితో బాధపడే వారి సంఖ్య రోజురోజుకూ ఎక్కువవుతోంది. ఈ వ్యాధిపై అవగాహన పెంచుకుని జాగ్రత్తగా మసలుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ వ్యాధిపై అవగాహన కోసం ప్రతి సంవత్సరం నవంబర్ 7న జాతీయ క్యాన్సర్ అవగాహన దినం నిర్వహిస్తున్నారు.

ఆరోగ్యశ్రీలో చికిత్స ఉచితం

జిల్లాలో క్యాన్సర్ వ్యాధికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు ప్రైవేటుగా పెంచికలపాడులోని విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్, కర్నూలులోని ఒమెగా క్యాన్సర్ హాస్పిటల్స్ ఉన్నాయి. ఈ మూడింటిలో దాదాపుగా అన్ని రకాల క్యాన్సర్‌లకు రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తోంది. వీటితో పాటు పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో క్యాన్సర్ కణతులకు చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు క్యాన్సర్ గడ్డలు తొలగించి ఆపరేషన్లు విజయవంతం చేస్తున్నారు. పాతికేళ్ల క్రితం రాయలసీమ మొత్తానికి కర్నూలులో ఒక్కరే క్యాన్సర్ డాక్టర్ ఉండేవారు. ఆయన వద్దకు అన్ని జిల్లాల నుంచి రోగులు చికిత్స కోసం వచ్చేవారు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 30 మంది దాకా క్యాన్సర్‌కు చికిత్సనందించే వివిధ విభాగాల వైద్యులున్నారు. వీరి వద్దకు ప్రతిరోజూ 20 నుంచి 30 మంది కొత్తగా క్యాన్సర్ బాధితులు వస్తున్నారు.

రూ.115.09కోట్లు క్లెయిమ్‌లు

డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా జిల్లాలోని మూడు ఆసుపత్రుల్లో అన్ని రకాల క్యాన్సర్ వ్యాధులకు చికిత్స ఉచితంగా లభిస్తోంది. 2019 నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం సర్జికల్ ఆంకాలజీలో 54,890 మందికి చికిత్స చేయగా రూ.201కోట్లు, మెడికల్ ఆంకాలజీలో 65,170 మందికి చికిత్స చేయగా రూ.120కోట్లు, రేడియేషన్ ఆంకాలజీలో 55,001 మందికి చికిత్స చేయగా రూ.115.09కోట్లు క్లెయిమ్ అయ్యాయి. మరోవైపు నాన్ కమ్యూనికబుల్ డిసీజ్(ఎన్‌సీడీ) ప్రోగ్రామ్ కింద జిల్లాలో క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల గుర్తింపు కొనసాగుతోంది.

అత్యాధునికంగా స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణం



స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్

కర్నూలులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణం దాదాపుగా పూర్తికావచ్చింది. రూ.120కోట్లతో అంచనాతో ఈ ఆసుపత్రిని నిర్మిస్తున్నారు. ఈ ఇన్సిట్యూట్ ప్రారంభమైతే అత్యాధునిక లీనియర్ ఆక్సలరేటర్(రేడియేషన్ మిషన్), ఎక్స్‌టర్నల్ ఆర్‌టీ మిషన్, బ్రాచి థెరపి హెచ్‌డీఆర్(నేరుగా క్యాన్సర్ కణితిపై రేడియేషన్ ఇస్తారు), సిటి సిమిలేటర్ పరికరాలు, ప్రత్యేకంగా రేడియాలజి విభాగం, పెథాలజి, మైక్రోబయాలజి విభాగాల సేవలు అందుబాటులోకి వస్తాయి. ఇవేగాక రేడియేషన్ థెరపిస్ట్, మెడికల్ రేడియేషన్, సర్జికల్ రేడియేషన్, సర్జికల్ ఆంకాలజిస్ట్, పీడియాట్రిక్ సర్జరీ పోస్టులు, స్టాఫ్‌నర్సులు, పారామెడికల్ సిబ్బంది, నాల్గవ తరగతి సిబ్బంది పోస్టులు వస్తాయి. ఇందుకు సంబంధించి ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం 273 పోస్టులను మంజూరు కూడా చేసింది. దీని నిర్మాణం పూర్తయితే కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా పెద్దాసుపత్రిలో క్యాన్సర్ రోగులు సేవలు అందే అవకాశం ఉంది.

నెలాఖరులోగా స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం



స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణం శరవేగంగా సాగుతోంది. నెలాఖరుకు ఎట్టిపరిస్థితుల్లోనూ కొన్ని విభాగాలు అందులో ప్రారంభిస్తాం. వీటిలో ముందుగా సర్జికల్ ఆంకాలజి, పాలియేటివ్ థెరపి, మెడికల్ ఆంకాలజి విభాగాలు ప్రారంభమవుతాయి. ఈ విభాగాలకు అవసరమైన ఓపీలు, ఆపరేషన్ థియేటర్లు, పోస్టు ఆపరేటివ్ వార్డు, మేల్, ఫిమేల్ వార్డులు, సిద్ధం అవుతున్నాయి. లీనియర్ ఆక్సలరేటర్(రేడియేషన్ మిషన్) ఏర్పాటుకు నిధులు కూడా విడుదల చేశాం. త్వరలో ఆ మిషన్ ఆసుపత్రిలో ఏర్పాటు చేయనున్నారు. స్టేట్ క్యాన్సర్ ఇన్సిట్యూట్ ప్రారంభమైతే కార్పొరేట్‌కు మిన్నగా సేవలు అందుబాటులోకి వస్తాయి.

–డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్

అవగాహనతోనే క్యాన్సర్ దూరం



దేశంలో ఏటా 1.1 మిలియన్ల కొత్త కేసులు నమోదవుతున్నాయి. ప్రతి 8 నిమిషాలకు ఒక మహిళ గర్భాశయ క్యాన్సర్‌తో మరణిస్తున్నట్లు అంచనా. నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్‌లు పురుషులలో 25 శాతం కంటే ఎక్కువ మరణాలకు కారణమయ్యాయి. రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ మరణాలు స్త్రీలలో ఎక్కువగా ఉన్నాయి. క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి.

–డాక్టర్ సి. వాసురెడ్డి, సర్జికల్ ఆంకాలజిస్టు



పారిస్ ఒలింపిక్స్ హాకీ క్వాలిఫయింగ్ టోర్నీ: భారత్‌కు కఠిన సవాలు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించేందుకు భారత మహిళల హాకీ జట్టు శ్రమించాల్సి ఉంటుంది. జనవరి 13 నుంచి 19 వరకు రాంచీలో జరిగే ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీ–1కు సంబంధించిన వివరాలను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) సోమవారం విడుదల చేసింది. ప్రపంచ ఆరో ర్యాంకర్ భారత్‌తోపాటు ఈ టోర్నీలో ప్రపంచ ఐదో ర్యాంకర్ జర్మనీ, న్యూజిలాండ్ (9), జపాన్ (11), చిలీ (14), అమెరికా (15), ఇటలీ (19), చెక్ రిపబ్లిక్ (25) జట్లు బరిలో ఉన్నాయి. ఈ టోర్నీలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు నెగ్గిన మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి. జనవరి 13 నుంచి 20 వరకు స్పెయిన్‌లోని వాలెన్సియాలో ఎనిమిది జట్ల (బెల్జియం, కెనడా, బ్రిటన్, ఐర్లాండ్, మలేసియా, దక్షిణ కొరియా, స్పెయిన్, ఉక్రెయిన్) మధ్య క్వాలిఫయింగ్–2 టోర్నీ జరుగుతుంది. ఈ టోర్నీ ద్వారా మరో మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందుతాయి.

డబుల్ ధమాకా...





- స్విస్ గ్రాండ్ చెస్ టోర్నీలో విజేతలుగా నిలిచిన వైశాలి, విదిత్
- ఇద్దరూ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత

ఐల్ ఆఫ్ మ్యాన్ (యూకే): అంతర్జాతీయ వేదికపై భారత చెస్ క్రీడాకారులు ఆర్. వైశాలి, విదిత్ సంతోష్ గుజరాతి సత్తా చాటుకున్నారు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో ఐల్ ఆఫ్ మ్యాన్ దీవిలో జరిగిన స్విస్ గ్రాండ్ టోర్నీలో ఓపెన్ విభాగంలో విదిత్ (మహారాష్ట్ర), మహిళల విభాగంలో వైశాలి (తమిళనాడు) చాంపియన్స్‌గా అవతరించారు. ఈ టోర్నీలో టైటిల్ సాధించిన తొలి భారతీయ క్రీడాకారులుగా వీరిద్దరు గుర్తింపు పొందారు. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత విదిత్ 8.5 పాయింట్లతో... వైశాలి కూడా 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. విదిత్ ఏడు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయాడు. వైశాలి ఆరు గేముల్లో నెగ్గి, ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచింది. చాంపియన్స్‌గా నిలిచిన విదిత్‌కు ట్రోఫీలతో పాటు 80 వేల డాలర్లు (రూ. 66 లక్షల 57 వేలు), వైశాలికి ట్రోఫీలతో పాటు 25 వేల డాలర్లు (రూ. 20 లక్షల 80 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ టైటిల్స్‌తో ఓపెన్ విభాగంలో విదిత్... మహిళల విభాగంలో వైశాలి క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించారు. ఓపెన్, మహిళల విభాగాల్లో వేర్వేరుగా ఎనిమిది మంది ప్లేయర్ల మధ్య క్యాండిడేట్స్ టోర్నీ వచ్చే ఏడాది ఏప్రిల్‌లో 2 నుంచి 25 వరకు కెనడాలోని టొరంటోలో జరుగుతుంది. క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచిన వారు ఓపెన్ విభాగంలో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో... మహిళల విభాగంలో ప్రస్తుత వరల్డ్ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)తో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం తలపడతారు.

వెర్‌స్టాపెన్‌కు 17వ విజయం

బ్రెజిల్ గ్రాండ్‌ప్రి టైటిల్ సొంతం



సావ్‌పాలో (బ్రెజిల్): మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో 17వ విజయాన్ని నమోదు చేశాడు. సీజన్‌లోని 20వ రేసు బ్రెజిల్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన అతను చివరిదాకా తన ఆధిక్యాన్ని కాపాడుకొని విజేతగా నిలిచాడు. వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంట 56 నిమిషాల 48.894 సెకన్లలో రేసును ముగించి టైటిల్ దక్కించుకున్నాడు. మొత్తం 20 మంది డ్రైవర్లలో 14 మంది మాత్రమే రేసును పూర్తి చేశారు. ఈ ఏడాది మొత్తం 22 రేసులు ఉండగా.. ఇప్పటికి 20 రేసులు ముగిశాయి. 17 రేసుల్లో వెర్‌స్టాపెన్ నెగ్గగా... రెండు రేసుల్లో సెర్జియో పెరెజ్ (రెడ్‌బుల్), ఒక రేసులో కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) గెలిచారు. ఈ సీజన్‌లోని తదుపరి రేసు లాస్‌వేగస్ గ్రాండ్‌ప్రి ఈనెల 19న జరుగుతుంది.

ఫైనల్లో స్వియాటెక్



కాన్‌కున్ (మెక్సికో): మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) ఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన రెండో సెమీఫైనల్లో స్వియాటెక్ 6–3, 6–2తో ప్రపంచ నంబర్‌వన్, గత ఏడాది రన్నరప్ సబలెంకా (బెలారస్)పై గెలిచింది. ఐదో ర్యాంకర్ జెస్సికా పెగూలా (అమెరికా)తో జరిగే ఫైనల్లో స్వియాటెక్ గెలిచి విజేతగా నిలిస్తే మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంటుంది.

గట్టెక్కిన బంగ్లాదేశ్

- వరుస ఆరు పరాజయాల తర్వాత మరో విజయం
- ప్రపంచకప్‌లో తొలిసారి శ్రీలంకపై గెలుపు
- కెప్టెన్ షకీబ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- అసలంక సెంచరీ వృథా


నజ్ముల్ షకీబ్


అసలంక

న్యూఢిల్లీ: ప్రపంచకప్‌లో అద్భుతం సాధిద్దామనే లక్ష్యంతో భారత గడ్డపై అడుగుపెట్టిన బంగ్లాదేశ్ తొలి మ్యాచ్‌లో గెలిచి శుభారంభం చేసింది. ఆ తర్వాత ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు కాదు.. వరుసగా ఆరు పరాజయాలను చవిచూసి సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ ప్రపంచకప్‌లో టాప్–7లో నిలిస్తేనే 2025 చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించే అవకాశం ఉండటంతో బంగ్లాదేశ్‌కు ఎనిమిదో మ్యాచ్ కీలకంగా మారింది. మాజీ విశ్వవిజేత శ్రీలంకతో జరిగిన ఈ పోరులో బంగ్లాదేశ్ మూడు వికెట్ల తేడాతో నెగ్గి మళ్లీ గెలుపు బాట పట్టింది. గెలుపుదారిలో వికెట్లను చేజార్చుకోవడం కలవరపెట్టినా... చివరకు బంగ్లాదేశ్ నుంచి విజయం మాత్రం చేజారలేదు. ప్రపంచకప్ చరిత్రలో శ్రీలంకపై బంగ్లాదేశ్‌కిదే తొలి విజయం కావడం విశేషం. 280 పరుగుల లక్ష్య ఛేదనలో నజ్ముల్ హొస్సేన్ షాంతో (101 బంతుల్లో 90; 12 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షకీబుల్ హసన్ (65 బంతుల్లో 82; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) కీలకపాత్ర పోషించారు. చివర్లో తౌహిద్ హ్రిదయ్ (7 బంతుల్లో 15 నాటౌట్; 2 సిక్సర్లు) నిలబడి బంగ్లాదేశ్ విజయాన్ని ఖాయం చేశారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 279 పరుగుల వద్ద ఆలౌటైంది. చరిత్ అసలంక (105 బంతుల్లో 108; 6 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీ సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లు తంజీమ్ హసన్ (3/80), షోరిఫుల్ (2/51), షకీబుల్ హసన్ (2/57) సమష్టిగా వికెట్లు పడగొట్టారు. అనంతరం బంగ్లాదేశ్ 41 పరుగులకే ఓపెనర్లు తంజిద్ హసన్ (9), లిటన్ దాస్ (23) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో నజ్ముల్, షకీబ్ అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 169 పరుగులు జోడించారు. 210 వద్ద షకీబ్, మరో పరుగు తర్వాత నజ్ముల్ నిష్క్రమించారు. మహ్మదుల్లా (22), ముష్ఫికర్ (10), మిరాజ్ (3) స్వల్ప వ్యవధిలో అవుటవ్వడంతో బంగ్లాదేశ్‌కు ఇబ్బంది ఎదురైంది. అయితే తౌహిద్, తంజీమ్ జట్టును విజయతీరానికి చేర్చారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (బి) తంజీమ్ 41; పెరీరా (సి) ముష్ఫికర్ (బి) షోరిఫుల్ 4; మెండిస్ (సి) షోరిఫుల్ (బి) షకీబ్ 19; సమరవిక్రమ (సి) మహ్మదుల్లా (బి) షకీబ్ 41; అసలంక (సి) లిటన్ (బి) తంజీమ్ 108; మాథ్యూస్ (టైమ్డ్ అవుట్) 0; ధనంజయ (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) మిరాజ్ 34; తీక్షణ (సి) సబ్–అహ్మద్ (బి) షోరిఫుల్ 21; చమీర (రనౌట్) 4; రజిత (సి) లిటన్ (బి) తంజీమ్ 0; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 279. వికెట్ల పతనం:** 1–5, 2–66, 3–72, 4–135, 5–135, 6–213, 7–258, 8–278, 9–278, 10–279. **బౌలింగ్:** షోరిఫుల్ 9.3–0–51–2, టస్కిన్ 10–1–39–0, తంజీమ్ హసన్ 10–0–80–3, షకీబ్ 10–0–57–2, మిరాజ్ 10–0–49–1.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తంజిద్ (సి) నిసాంక (బి) మదుషంక 9; లిటన్ దాస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మదుషంక 23; నజ్ముల్ (బి) మాథ్యూస్ 90; షకీబ్ (సి) అసలంక (బి) మాథ్యూస్ 82; మహ్మదుల్లా (బి) తీక్షణ 22; ముష్ఫికర్ (బి) మదుషంక 10; తౌహిద్ (నాటౌట్) 15; మిరాజ్ (సి) అసలంక (బి) తీక్షణ 3; తంజీమ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (41.1 ఓవర్లలో 7 వికెట్లకు) 282. వికెట్ల పతనం:** 1–17, 2–41, 3–210, 4–211, 5–249, 6–255, 7–269. **బౌలింగ్:** మదుషంక 10–1–69–3, తీక్షణ 9–0–44–2, కసున్ రజిత 4–0–47–0, చమీర 8–0–54–0, మాథ్యూస్ 7.1–1–35–2, ధనంజయ డిసిల్వా 3–0–20–0.

మాథ్యూస్ 'టైమ్డ్ అవుట్'

తొలి క్రికెటర్‌గా గుర్తింపు



శ్రీలంక క్రికెటర్ ఏంజెలో మాథ్యూస్ అనూహ్య, అరుదైన రీతిలో అవుట్టై క్రికెట్ చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. 146 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్‌లో 'టైమ్డ్ అవుట్' ద్వారా అవుట్ అయిన తొలి క్రికెటర్‌గా అతను నిలిచాడు. సోమవారం బంగ్లాదేశ్‌తో న్యూఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. లంక ఇన్నింగ్స్ 25వ ఓవర్ రెండో బంతికి సమరవిక్రమ అవుటయ్యాడు. నిబంధనల ప్రకారం తర్వాతి బ్యాటర్ 2 నిమిషాల్లోగా బంతిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. క్రీజ్‌లోకి మాథ్యూస్ సరైన సమయానికే వచ్చినా బంతిని ఎదుర్కోవడంలో ఆలస్యం చేశాడు. తన హెల్మెట్‌ను సరి చేసుకుంటుండగా దాని స్ట్రాప్ తెగింది. దాంతో మరో హెల్మెట్ కోసం సైగ చేయగా, చమిక మైదానంలోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు. అప్పటికే సమయం మించిపోవడంతో బౌలర్, బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ 'టైమ్డ్ అవుట్' కోసం అప్పీల్ చేశాడు. దాంతో అప్పీల్‌ను పరిగణనలోకి తీసుకున్న అంపైర్లు చర్చించి నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను 'అవుట్'గా ప్రకటించారు. తన హెల్మెట్ సమస్యను బ్యాటర్ అంపైర్లకు వివరించినా వారు స్పందించలేదు. ఆ తర్వాత అప్పీల్ వెనక్కి తీసుకోమని షకీబ్‌ను కూడా కోరినా అతను ససేమిరా అనడంతో మాథ్యూస్ వెనుదిరగక తప్పలేదు. అనంతరం ఫోర్త్ అంపైర్ ఏడ్రియన్ హోల్డ్‌స్టాక్ దీనిపై మరింత స్పష్టతనిచ్చారు. 'మాథ్యూస్‌కు హెల్మెట్ సమస్య కూడా రెండు నిమిషాల తర్వాత వచ్చింది. అప్పటికీ అతను బంతిని ఎదుర్కోకుండా ఆలస్యం చేశాడు. క్రీజ్‌లోకి వచ్చే ముందు ఎక్విప్‌మెంట్‌లో అన్నింటినీ సరిగ్గా చూసుకోవడం కూడా బ్యాటర్‌దే బాధ్యత' అని ఆయన చెప్పారు. దాంతో షకీబ్ క్రీడా స్ఫూర్తి అంశాన్ని పక్కన పెడితే నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను అవుట్‌గా ప్రకటించడం సరైందే.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	7	5	2	10	0.924
న్యూజిలాండ్	8	4	4	8	0.398
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	7	4	3	8	-0.330
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	8	2	6	4	-1.160
నెదర్లాండ్స్	7	2	5	4	-1.398
ఇంగ్లండ్	7	1	6	2	-1.504

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర.రే–నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా × అఫ్గానిస్తాన్
వేదిక: ముంబై
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

పంజాబ్ ఎట్టకేలకు...

మొహాలి: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పంజాబ్ జట్టు తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. బరోడా జట్టుతో జరిగిన ఫైనల్లో పంజాబ్ 20 పరుగుల తేడాతో గెలిచింది. గతంలో పంజాబ్ నాలుగుసార్లు (2007, 2012, 2013, 2015) పంజాబ్ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మొదట బ్యాటింగ్ కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 223 పరుగులు సాధించింది. అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (61 బంతుల్లో 113; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు సెంచరీ చేశాడు. అనంతరం బరోడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 203 పరుగులు చేసి ఓడిపోయింది. బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ (4/23) పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

సినిమా

కనిపించడు.. వ్యాపించి ఉంటాడు!


రవితేజ

''కొండలో లావాని కిందకి పిలవకు... ఊరు ఉండదు.. నీ ఉనికి ఉండదు'' అంటూ రవితేజ వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'ఈగల్' సినిమా టీజర్. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ఇది. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. ''ఎక్కడుంటాడు?(అనుపమా పరమేశ్వరన్).. అడవిలో ఉంటాడు.. నీడై తిరుగుతుంటాడు.. కనిపించడు. కానీ వ్యాపించి ఉంటాడు ('అవసరాల' శ్రీనివాస్) వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: దావ్ జాంద్, సహ–నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

అనుష్క @ 50


అనుష్క

'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి హిట్ మూవీ తర్వాత అనుష్క నటించనున్న తెలుగు చిత్రం ఏంటి? అనే ప్రశ్నకు సోమవారం సమాధానం దొరికింది. నేడు (నవంబర్ 7) అనుష్క పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమె నటించనున్న తాజా సినిమా ప్రకటన వచ్చింది. అనుష్క లీడ్ రోల్‌లో జి.అశోక్ దర్శకత్వంలో 'భాగమతి'ని నిర్మించిన యూవీ క్రియేషన్స్ అధినేతలు వంశీ, ప్రమోద్ తాజాగా 'భాగమతి 2'ని ప్రకటించారు. అనుష్క నటించనున్న 50వ చిత్రం ఇది. ఇక 'భాగమతి' చిత్రం 2018 జనవరి 26న విడుదలై, మంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. దాదాపు ఆరేళ్లకి 'భాగమతి 2' సినిమా ప్రకటించారు వంశీ, ప్రమోద్. ఈ సినిమాని భారీ స్థాయిలో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ చిత్ర దర్శకుడు, నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. కాగా అనుష్క నటించిన తాజా మలయాళ చిత్రం 'కథనార్' విడుదలకు సిద్ధమవుతోంది.

రంగరాయ శక్తివేల్ నాయకర్.. థగ్‌లైఫ్


కమల్ హాసన్

'నాయగన్'(1987) చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రానికి 'థగ్ లైఫ్' టైటిల్‌ని ఖరారు చేసి, టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను సోమవారం రిలీజ్ చేశారు మేకర్స్. అలాగే ఈ చిత్రంలో త్రిష, దుల్కర్ సల్మాన్, 'జయం' రవి కీలక పాత్రలు పోషించనున్నట్లు కూడా వెల్లడించారు. 'రంగరాయ శక్తివేల్ నాయకర్.. నాది కాయల్ పట్టినమ్', 'రంగరాయ శక్తివేల్ నాయకర్ అంటే క్రిమినల్, గూండా, యాకుజా. యాకుజా అంటే జపనీస్‌లో గ్యాంగ్‌స్టర్ అని అర్థం', 'చావు నా కోసం ఎదురుచూడటం ఇదేం తొలిసారి కాదు. చివరిసారి కూడా కాదు', 'నా పేరు రంగరాయ శక్తివేల్ నాయకర్.. మర్చిపోవద్దు' అని కమల్‌హాసన్ చెప్పే డైలాగ్స్ 'థగ్స్ లైఫ్' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోలో ఉన్నాయి. కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్ మహేంద్రన్, శివ అనంత్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నేడు కమల్ బర్త్ డే సందర్భంగా 'థగ్ లైఫ్'కి సంబంధించిన విశేషాలను సోమవారం వెల్లడించారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: రవి కె.చంద్రన్.

నన్ను కొత్తగా చూస్తారు

\- రాఘవా లారెన్స్

రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'జిగర్ తండ డబుల్ ఎక్స్'. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో కార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో చెప్పిన విశేషాలు.


ఎస్‌జే సూర్య, రాఘవా లారెన్స్

లారెన్స్ మాట్లాడుతూ – ''జిగర్ తండ' సినిమాలోని గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటించే తొలి అవకాశం నాకే వచ్చింది. కానీ అప్పుడు ఇతర ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉండటం వల్ల చేయడం కుదర్లేదు. ఆ తర్వాత 'జిగర్ తండ'కు రెండు జాతీయ అవార్డులు వచ్చాయి. దీంతో 'జిగర్ తండ' కు సీక్వెల్ ఉన్నట్లయితే అందులో నేను నటిస్తానని కార్తీక్ సుబ్బరాజుకి చెప్పాను. ఈ సీక్వెల్ 'జిగర్ తండ: డబుల్ ఎక్స్' కథ సిద్ధమైన ఏడాది తర్వాత కార్తీక్ సుబ్బరాజు ఫోన్ చేసి చెప్పారు. కథ నచ్చడంతో ఈ సినిమాలో నటించాను. ● ఈ సినిమా విషయంలో దర్శకుడు కార్తీక్ చెప్పినట్లు చేశాను. ప్రేక్షకులు కొత్త రాఘవా లారెన్స్‌ని చూస్తారు. సినిమా ఫస్టాఫ్‌లో యాక్షన్, సెకండాఫ్‌లో భావోద్వేగాల సన్నివేశాలు ఉంటాయి. ముఖ్యంగా చివరి 20 నిమిషాలు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుంది. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకుల హృదయం కూడా బరువెక్కుతుంది. ● త్వరలో 'కాంచన 4' స్టార్ట్ చేస్తాను. ఇక సూపర్ స్టార్ రజనీకాంత్‌గారి కోసమే కాదు.. సూపర్ స్టార్, మెగాస్టార్ (చిరంజీవిని ఉద్దేశిస్తూ..) కలిసి యాక్ట్ చేసే ఓ మల్టీస్టారర్ స్క్రిప్ట్ నా దగ్గర ఉంది. కానీ వారు యాక్ట్ చేయాలి కదా'' అన్నారు.

నటుడు– దర్శకుడు ఎస్‌జే సూర్య మాట్లాడుతూ– ''దర్శకత్వం–నటన..ఈ రెండింటిలో నాకు నటన అంటేనే ఇష్టం. అయితే నా కెరీర్ ప్రారంభంలో యాక్టింగ్ అవకాశాల కోసం డైరెక్షన్‌ని వారధిగా వినియోగించుకున్నాను. ఇక 'జిగర్ తండ: డబుల్‌ఎక్స్'లో లారెన్స్‌గారిది గ్యాంగ్‌స్టర్ రోల్. నాదేమో దర్శకుడు కావాలనుకునే పాత్ర. నా పాత్రలో సత్యజిత్ రేగారి సినిమాల రిఫరెన్స్ ఉండటంతో ఇదొక బహుమతిగా భావించి ఈ మూవీ చేశాను. మంచి మాస్ కమర్షియల్ అంశాలు ఉన్న సందేశాత్మక చిత్రం ఇది. ఈ సినిమా షూటింగ్ కోసం ఓ విలేజ్ సెట్ వేయాల్సి వచ్చింది. ఇందులో భాగంగా ఓ రోడ్, బ్రిడ్జ్ వేశాం. అప్పటికే రోడ్, బ్రిడ్జ్ సౌకర్యాలు లేక ఇబ్బందిపడుతున్న ఆ గ్రామస్తులకు ఇవి ఇప్పుడు ఉపయోగపడుతున్నాయి. నేను నటిస్తూ, నా దర్శకత్వంలో ఓ సినిమా రానుంది'' అని చెప్పుకొచ్చారు.


● బన్నీ వాసు, తేజా మార్ని, అల్లు అరవింద్, అనిల్ రావిపూడి, శివానీ, రాహుల్ విజయ్, విద్య

ఈ కథ చాలా సంతృప్తినిచ్చింది

\- నిర్మాత అల్లు అరవింద్

రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కి దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత అల్లు అరవింద్ అతిథులుగా హాజరయ్యారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''పోలీసులను రాజకీయ నాయకులు ఏ విధంగా వాడుకున్నారనే అంశంపై ఈ సినిమా ఉంటుంది. చాలా సంతృప్తినిచ్చిన కథ ఇది. పోలీసులు పడే బాధలు, ఇబ్బందులు ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు. ''ఈ సినిమా ఒరిజినల్ (మలయాళ చిత్రం 'నాయట్టు') చూశాను. 'కోట బొమ్మాళి'లో చాలా మార్పులు చేశారు. టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. ఇప్పుడు నిర్మాతగా వస్తున్న విద్యాగారు సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు అనిల్ రావిపూడి. ''తేజా మార్ని డైరెక్షన్, కాశీ నాగేంద్ర డైలాగ్స్ ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయి. సిటీల్లో జరిగే ఎన్నికల గురించి నాకు పెద్దగా తెలియదు. ఊర్లలో ఉన్న, అక్కడి ఎలక్షన్స్‌లో పాల్గొంటున్న వారికి ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు గట్టిగా తగుల్తాయి. కొంతమంది రాజకీయ నాయకులకు కూడా తగలొచ్చు. ఏ పార్టీకీ కొమ్ము కాసేలా ఈ సినిమా ఉండదు'' అన్నారు 'బన్నీ' వాసు. ''నేరస్తులను పట్టుకోవాల్సిన పోలీసులే ఓ కేసులో ఇరుక్కుని ఎలా అవస్థలు పడ్డారనేది ఈ సినిమా కాన్సెప్ట్'' అన్నారు తేజా మార్ని. ''ఈ సినిమా కోసం అందరూ చాలా కష్టపడ్డారు'' అన్నారు విద్యా. ఈ కార్యక్రమంలో చిత్ర కో ప్రొడ్యూసర్స్ భాను–రియాజ్, రైటర్ కాశీ నాగేంద్ర, ఆర్ట్ డైరెక్టర్ గాంధీ, నిర్మాతలు ధీరజ్, వంశీ నందిపాటి, ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.


● గౌరీకృష్ణ

ఈ విజయం కొత్తగా ఉంది

\- నిర్మాత గౌరీకృష్ణ

''నేను గతంలో పలు సినిమాలు నిర్మించినా అనుకున్నంత విజయం సాధించలేదు. 'మా ఊరి పొలిమేర 2' చిత్రంతో తొలి హిట్ అందుకున్నా.. ఈ విజయం చాలా కొత్తగా ఉంది. మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అని నిర్మాత గౌరీకృష్ణ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల జంటగా డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా గౌరీకృష్ణ మాట్లాడుతూ– ''మా ఊరి పొలిమేర' తొలి భాగం విజయం సాధించిందని సీక్వెల్ తీయలేదు. అనిల్ విశ్వనాథ్‌పై నమ్మకంతోనే 'మా ఊరి పొలిమేర 2' తీశాం. గీతా ఆర్ట్స్ సంస్థకు చెందిన వంశీ నందిపాటిగారు విడుదల చేయడం వల్ల సినిమాకు ప్లస్ అయ్యింది. నిర్మాతగా నా తర్వాతి చిత్రానికి కథా చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

అన్నదమ్ముల అనుబంధం


● సంపూర్ణేష్ బాబు, సంజోష్

సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీ బన్సాల్, ఆర్తీ గుప్తా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సోదరా'. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వం వహించారు. చంద్ర చంగ్లా నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాత వివేక్ కూచిభొట్ల రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో వినోదాత్మకంగా 'సోదరా'ను రూపొందించాం. ఇటీవలే విడుదలైన మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమాని త్వరలోనే విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: జాన్.

ఇది మనందరి కథ

\- దర్శకుడు మారేష్ శివన్

''ప్రేమ, లక్ష్యం.. ఈ రెండింటినీ ఒకేసారి ఎంచుకోవాల్సి వస్తే ఏం చేస్తారు? ఏం చేయాలి? అనే సందేశంతో 'అలా నిన్ను చేరి' సినిమా తీశా. ప్రతి మనిషిలో జరిగే కథ ఇది. యువతరంతో పాటు కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం ఇది. మా చిత్రాన్ని చూసిన తర్వాత కొంత మందైనా మారతారనే నమ్మకం ఉంది'' అని దర్శకుడు మారేష్ శివన్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలవుతోంది. మారేష్ శివన్ విలేకరులతో మాట్లాడుతూ–''ఈ చిత్ర కథ 2012 నేప థ్యంలో జరుగుతుంది. 2012లో రాసుకున్న కథే అయినా ఇందులోని ప్రేమ, భావోద్వేగాలు ఇప్పటి వారికి కూడా నచ్చుతాయి. సుభాష్ ఆనంద్ సంగీతం ఓ ప్లస్. ఈ సినిమా ప్రీమియర్ చూసిన డైరెక్టర్ త్రినాథరావు, నిర్మా తలు బెక్కెం వేణుగోపాల్, బెల్లంకొండ సురేష్‌వంటి వారు మంచి సినిమా తీశానని అభినందించారు. ప్రేక్షకులు థియేటర్స్ నుంచి అదే భావోద్వేగంతో బయటికొస్తారు'' అన్నారు.

